# భౌతిక మరణం అనే ఆశీర్వాదం

## The Blessing of Physical Death

**పాఠ్యోద్దేశం** : ఆదాము హవ్వలు పాపం చేసిన తరువాత భౌతిక మరణం అనే శిక్షశాపంగా ఉండవలసిందిపోయి ఆశీర్వాదంగా మారిపోయిందని తెలిపి, యేసు వచ్చేంత వరకూ చనిపోయిన వారు ఎక్కడ వుంటారో చూపించుట.

### ఉపోద్ఘాతము

మరణం మరియు దాని తదుపరి సంగతులను బైబిలు క్రైస్తవుల కోసం స్పష్టంగా వర్ణిస్తుంది. మరణాన్ని అర్థం చేసుకోవటంలో మనం అందరి కంటే కూడా ఎక్కువ సామర్థ్యం గలవారమే. కానీ, మనలో ఎక్కువ మంది మన దేహం నుండి మన సొంత ఆత్మ వేరు కావటానికి సంబంధించిన చర్చను అలక్ష్యం చేయటానికి ఎక్కువగా ఆలోచిస్తాము. "ఒక్కరికి ఒక్కరు" చొప్పున మనుష్యులు చని పోతున్నారని గణాంక వివరాలు స్పష్టంగా చూపిస్తున్నప్పటికీ, మన సొంత మరణమును గూర్చిన ప్రస్తావన వచ్చేసరికి "దానికళ్లలోకి" నేరుగా చూడటానికి మనలో చాలా మందికి కష్టంగా ఉంటుంది. పరలోక ప్రయాణానికి సంబంధించి క్రైస్తవులు పాటలు పాడటం ఎక్కువ గానే ఉంటుంది. అయితే నేమి? ఈలోకంలో బ్రతికి వుండాలని కూడా ఎక్కువ గానే ప్రార్థిస్తున్నాము. పరలోకం వెళ్లాలనే కోరిక ఉంది. కాని ఇప్పుడే కాదు. మన సొంత మరణానికి సంబంధించి మన విశ్వాసం ఎంతగా బలపడవలసిన అవసరం వుందో ఈ అసంబద్ధంలోని పరిహాసం, మనకు చూపిస్తుంది. దేవుని వాక్యం వినుట ద్వారా విశ్వాసం కలుగుతుంది. అందుచేత, భౌతికమరణం అనే ఈ అంశం మీద ఎక్కువగా బైబిలు పఠనంచేస్తే మనస్వంత మరణాన్ని గూర్చి మనం ఎక్కువగా సుముఖత కనుబరు స్తాము. అపొస్తలు డైన పౌలుకు బలమైన విశ్వాసం వుంది. తన మరణాన్ని గూర్చి ఈక్రింది వచనాలలోని భావాలను వ్యక్తం చేయటానికి హేతువు ఆ విశ్వాసమే.

> *నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే చావైతే లాభము. అయినను శరీరముతో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమి కోరుకొందునో నాకు తోచలేదు. ఈ రెంటి మధ్యను ఇరుకునబడి యున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతోకూడ నుండవలెనని నాకు ఆశయున్నది, అది నాకు మరి మేలు. అయినను నేను శరీరము నందు నిలిచి యుండుట మిమ్మునుబట్టి మరి అవసరమైయున్నది.*
> ఫిలిప్పీ. 1:21-24

ఈ పాఠంలోను, ఆరవ భాగంలోని మిగిలిన పాఠములలోను మరణానికి సంబం ధించిన బైబిలు భావాన్ని నేర్చుకుంటాము. మరణమును గూర్చిన విశ్వాస విషయంలో "పౌలును పోలి నడుచుకొనునట్లు" క్రైస్తవులకు సహాయం చేయటమే ఆ పఠనం యొక్క ఉద్దేశం (1 కొరింథీ.11:1).

### పాఠం

నెక్రోస్ (NEKROS) అనే గ్రీకు పదం క్రొత్త నిబంధనలో "మృతము" "మృతుడు" అని తర్జుమా చేయబడింది. మృతుడు (NEKROS) అనే మాటలో సామాన్యంగా చివరి ఊపిరి విడిచిన వాడనే అర్థం ఇమిడి వుంది. "ప్రాణము లేని శరీరము మృతము" (యాకోబు 2:26) అని చెబుతూ యాకోబు చెప్పిన నిర్వచనానికి నిజంగా మనం ఏదీ చేర్చలేము. అంతకు మించిన నిర్వచనాన్ని ఇవ్వలేము "థెనాటోస్" (THANATOS) అనే గ్రీకుపదం నుండి మరణం అనే మాట తర్జుమా చేయబడింది శరీరం నుండి ఆత్మ వేరైపోవుటయని దాని భావం. ఈ ఎడబాటు వల్ల భూమిమీద మానవ జీవితం అంతమైపోతుంది. నెక్రోస్ మరియు థెనాటోస్ అనేమాటలు ఆత్మీయం గాను. భౌతికంగాను కూడా ప్రయోగింపబడ్డాయి. దేవుని నుండి తమ్మును తాము దూరపరచుకోవటానికి పాపానికి అవకాశం ఇచ్చినవారెవరో వారు ఆత్మీయ మరణంలో ఉన్నారు (థెనాటోస్) కావున వారు ఆత్మీయంగా మృతులై ఉన్నారు (నెక్రోస్). ఈ రెండు మాటలు మానవుని అంతాన్ని సూచించలేదని దయతో గమనించండి.

మానవ శరీరము 63% నీరు, హైడ్రోజన్, 25.5% ప్రాణవాయువు, 9.5% కార్బన్‌తోను, మిగిలిన 2%లో 1.4% భాస్వరముతో యితరములైన ఏడు రసాయనిక పదార్థములతోను నిర్మింపబడినదని జీవ శాస్త్ర అధ్యయనము మనకు బయలుపరుచు చున్నది. మన శరీరాలు ఏ అణువులతో నిర్మింపబడ్డాయో అవే అణువులు నేలమంటి లోను, సముద్ర జలా ల్లోను విరివిగా వుంటాయని మనం నేర్చుకొన్న తరువాత ఈ క్రింది లేఖనాలు అర్థం చేసుకోటానికి ఏమంత కష్టంగా వుండదు.

> *దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను.* ఆది. 2:7.

> *మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును.* ప్రసంగి 12:7

నాస్తికులు నమ్ముతున్నట్లుగా, మరణం తరువాత దేవుని యొద్దకు పోవటానికి ఆత్మ అనేదే లేనిపక్షంలో, వ్యక్తి యొక్క అంతం మరణం అని అర్థమౌతుంది. శాశ్వతమైన ఆత్మయొక్క ఉనికిని అంగీకరించక పోయినప్పటికీ శరీరంలోని అణువులు విశ్వంలో ఒక భాగంగానే కొనసాగుతాయని వారు నమ్మవచ్చునేమో! బహుశా, చాలా మంది మతస్థుల యుగాంత దృక్పథాన్ని నాస్తిక దృక్పథమే ప్రభావితం చేసిందేమో! ఎందుకంటే, మరణం విషయంలో పౌలు వ్యక్తం చేసిన ఆసక్తికరమైన దృక్పథంలో మనం కూడా పాలు పొందలేక పోతున్నాం. విశ్వాసం లేని వారైనా, బలహీనమైన విశ్వాసము గల వారైనా తమ మరణాన్ని వారి యొక్క అంతముగా వ్యాఖ్యానించు కుంటారు. అయినప్పటికీ, ఈ రకమైన బోధను బైబిలు అంగీకరించటం లేదు.

మరణాన్ని గూర్చిన సరియైన దృక్పథాన్ని వర్ణించే బైబిలు పదజాలాలు కొన్ని ఈ క్రింద ఉదాహరింపబడ్డాయి. "ఇదిగో, నీవు నీ పితరులతో పండుకొనబోవుచున్నావు" అని దేవుడు మోషేతో చెప్పాడు (ద్వితి. 31:16). "నీవు క్షేమముగా నీ పితరుల యొద్దకు పోయెదవు మంచి వృద్ధాప్యమందు పాతిపెట్టబడెదువు" అని దేవుడు అబ్రా హాముతో చెప్పాడు (ఆది. 15:15). "అబ్రాహాము నిండు వృద్ధాప్యమునకు వచ్చినవాడై మంచి ముసలితనమున ప్రాణము విడిచి, మృతిబొంది తన పితరుల యొద్దకు చేర్చబడెనని" ... కూడా తరువాత వ్రాయబడింది (ఆది. 25:8). తన ఆరోగ్యం కోల్పోయినప్పుడు యోబు, "మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?" అని అడిగాడు. "ఆలాగుండినయెడల నాకు విడుదల కలుగు వరకు నా యుద్ధ దినము లన్నియు నేను కనిపెట్టియుందును" అని అతడు ఆ మీదట పలికాడు (యోబు14:14). ఆపై అతడు "కొద్ది సంవత్సరములు గతించిన తరువాత తిరిగి రాని మార్గమున నేను వెళ్లుదును" అని కూడా చెప్పటం జరిగింది (యోబు 16:22). "నా గుడారమును త్వరగా విడిచిపెట్టవలసి వచ్చుననియెరిగి..." అంటూ అపొస్తలుడైన పేతురు మాట్లాడి నాడు (2 పేతురు 1:13,14). క్రీస్తుతోకూడా ఉండటానికే వెడలిపోవటం తప్ప మరింకేమీ కాదని అపొస్తలుడైన పౌలు మరణాన్ని గూర్చి మాట్లాడినాడు (ఫిలిప్పీ. 1:23).

మరణాన్ని ఒక అంతముగా గానీ లేదా భయపడవలసిన ఒక అనుభవముగా గానీ బైబిలు ప్రదర్శించుట లేదు. అయినప్పటికీ, మరణం ఆనందదాయకమైన అంశం అని చాలామంది క్రైస్తవులు ఆలోచన చేయటం లేదు. మన సొంత మరణం సమీపిస్తున్న తరుణంలో నిశ్చయంగా అది యొక ధన్యకరమైన సంఘటనగా మనం దానిని చూడవలసిన అవసరం వుంది. మనల్ని విడిచిపెట్టి వెళ్లిపోయిన మన ప్రియుల విషయంలో మరణం ఆనందదాయకమైన సందర్భముగా ఉండాలని మన ఉద్దేశం కాదు. అయినప్పటికీ, అబ్రాహాము వలె నిండు వృద్ధాప్యమునకు చేరుకున్నవారమై, మన బ్రతుకులతో సంతృప్తి చెందిన వారమైతే తప్పక మనం మన మరణం విషయంలో ఆనందించాలి. అయితే, మరణం తదుపరి సంగతుల విషయంలో మనం ఒకసాను కూలదృక్పథాన్ని పెంపొందించుకొనంత కాలం మన సొంత మరణం విషయంలోమన మెన్నడూ ఆనందంగా ఉండలేం.

"చావైతే లాభం" అని నమ్మటానికి కనీసం ఓ నాలుగు ప్రశ్నలకు ఇవ్వబడే జవాబులు మనకు అర్థం కావాలి. మొదటి ప్రశ్న, దేవుడు మనకు మరణాన్ని ఎందు కియ్యాలి? రెండవ ప్రశ్న, భౌతిక మరణంలో అసలు ఏమి సంభవిస్తుంది? మూడవ ప్రశ్న, చనిపోయిన వెంటనే మన అసలు వ్యక్తి ఎక్కడికి వెళ్లిపోతాడు? మరియు ఆ తదుపరి ఏమి జరుగుతుంది? అనేది నాలుగవ ప్రశ్న. నాల్గవ అంశాన్ని రాబోయే పాఠాలలో నేర్చుకుందాం. అయితే, మొదటి మూడు అంశాల్ని ఇప్పుడు వరుసగా ఆలోచించుదాం. మానవాళి మరణించటానికి దేవుడు ఎందుకు అనుమతి ఇచ్చాడో మొదటిగా ఆలోచించుదాం. దీనికో బలమైన కారణం వుంది. ఈ క్రింది లేఖనంలో అది స్పష్టంగా చెప్పబడింది.

*అప్పుడు దేవుడైన యెహోవా-ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో ఒకని వంటివాడాయెను. కాబట్టి అతడు ఒకవేళ తన చెయ్యి చాచి జీవవృక్షఫలమును కూడా తీసుకొని తిని నిరంతరము జీవించునేమో అని దేవుడైన యెహోవా అతడు ఏ నేలనుండి తీయబడెనో దాని సేద్యపరచుటకు ఏదెను తోటలోనుండి అతని పంపివేసెను. ఆది. 3:22, 23*

భౌతిక మరణం ఒక శాపం అని చాలా మంది నమ్ముతారు. తమ సొంత ప్రతి కూల యుగాంత దృక్పథమే అందులకు ముఖ్య కారణం. మరణం విషయంలోమనం ప్రతికూల దృక్పథాన్ని కలిగివుంటే, "నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చె దవు"అని దేవుడు చెప్పినమాట. నిజంగా శాపమే అవుతుంది. (ఆది. 2:17). అయిన ప్పటికిని, పాప మరణాలను గూర్చిన పౌలు వివరణతో దేవుడు చెప్పిన ఇదే మాటను ఆలోచన చేస్తే కేవలం అది ఒక వాస్తవానికి సంబంధించిన వివరణగా అర్థం అవుతుంది. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరూ పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను" అని పౌలు చెప్పాడు (రోమా. 5:12) ఆదాము హవ్వలు పాపం చేసిన తరువాత దేవుడు పెట్టిన శాపం ఆహార సంపాదన లోను, పిల్లలను కనటంలో వారు అనుభవింపవలసిన భౌతిక శ్రమలో అగుపిస్తుంది. భౌతిక మరణం ఒక శాపంకాదు. అయితే, ఆదాము హవ్వలు పాపులైభౌతిక శరీరంలో మంచి చెడ్డల తెలివిని పొందిన తరువాత భౌతిక మరణం అవసరమైంది. దయచేసి, ఆది 3:13-21 చదవండి.

దేవుని ఆజ్ఞను అతిక్రమించిన తరువాత ఆదాము హవ్వలు ఒక్క విషయంలో మాత్రం దేవుని వంటి వారు అయ్యారు. దేవుని వలెనే వారు కూడా మంచిని చెడును గ్రహించగల సామర్థ్యం కలిగినవారయ్యారు. కానీ, వారు పాపులుగా ఉండిరి. వారు ఎల్లప్పుడు పాపులై ఉండవలసివుండినది ఎందుకంటే, వారు ప్రతి పరిస్థితిలోను ఎల్లప్పుడు మంచినే ఎన్నుకోలేక పోయారు. ఇప్పుడొక ప్రశ్న: ఆదాము హవ్వలు తమ యొక్క మానసిక శక్తిలో ఒక భాగంగా ఈ క్రొత్త జ్ఞానాన్ని కలిగి నిరంతరం జీవించునట్లు దేవుడు వారికి అవకాశమిస్తే అది దేవునినుండి వచ్చే ఆశీర్వాదం అవుతుందా? భౌతిక మరణం ఒక ఆశీర్వాదంగా వారికి దేవుడు అనుగ్రహించి యుండకపోతే ఈ రోజుకు వారి వయస్సు కొన్ని వేల సంవత్సరాలు అయ్యేది. అంతేకాక, ఏదెనుతోటనుండి పంపివేయబడటానికి బాధ్యులు ఎవరు అనే విషయాన్నిగూర్చి ఇంకా వారిరువురు వాదించుకుంటూనే ఉండవచ్చు. అయితే, మనం అడగవలసిన నిజమైన ప్రశ్న ఏదంటే, ఈ మంచి చెడ్డల తెలివి గల భౌతిక శరీరాలతో మనం నిరంతరం జీవించే అవకాశం కలిగివుండాలా? మానవ జాతికి మొదటివాడు ఆదామనీ, మనమంతా అతని నుండే వచ్చామని జ్ఞాపకం చేసుకోండి (అపొ. కార్య. 17:26). మన ప్రస్తుత రూపంలో అంటే, భౌతికశరీరాలలో జీవిస్తున్నప్పుడు మంచి చెడ్డల తెలివిని సరిగా వినియోగించుకోలేము. ఈ క్రొత్త జ్ఞానాన్ని మనం పొందినప్పటికినీ, మానవాళిని

తిరిగి రూపొందించాలనే ఉద్దేశం దేవునికెన్నడూ లేదనేది సుస్పష్టం. ఈ క్రింది లేఖనం ప్రకారం ఆదాముకేది సంభవించిందో అదే మనకందరికీ సంభవించునని తెలిసికోగలం.

> *ఇందు విషయమై-ఆదామను మొదటి మనుష్యుడు జీవించుప్రాణి ఆయెనని వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను. ఆత్మ సంబంధమైనది మొదట కలిగినది కాదు, ప్రకృతి సంబంధమైనదే మొదట కలిగినది తరువాత ఆత్మ సంబంధమైనది. మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మనుష్యుడు పరలోకము నుండి వచ్చినవాడు. మంటి నుండి పుట్టినవాడెట్టివాడో మంటినుండి పుట్టిన వారును అట్టివారే. పరలోక సంబంధి యెట్టివాడో పరలోక సంబంధులును అట్టివారే. మరియు మనము మంటి నుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము.* 1 కొరింథీ. 15:45-49

మంచి చెడ్డల తెలివిని ఆదాము హవ్వలు పొందిన కారణాన మానవులంతా ఈ జ్ఞానం కలిగి వుండవలసివచ్చింది. ఈ జ్ఞానాన్ని పొందిన కారణాన మనం చనిపోవటమే శ్రేయస్కరం. సామాన్యంగా మనం ఈ భౌతిక శరీరంలో మంచి చెడ్డల తెలివిని సరిగా వినియోగించలేము. అంతేకాదు దేవుని నుండి వైరేతే ఆనందదాయకమైన జీవితాన్ని జీవించలేము. వాస్తవమేమిటంటే; పాపమనే చెడును ఎన్నుకోవడం ద్వారా మనము గుర్తును కోల్పోయినప్పుడు దేవుడు తనను తాను మన నుండి వేరు చేసు కుంటాడు. ఇదే ఆత్మీయ మరణమైయున్నది. “మరణపు ముల్లు పాపము” 1 కొరింథీ.15:56. మంచి చెడ్డల తెలివిని పొందిన తరువాత మానవుని జీవన పోరాటములకు సంబంధించిన వృత్తాంతమే మానవాళికి సంబంధించిన బైబిలు వృత్తాంతం. మానవాళికి భౌతిక మరణం అను గ్రహించి, వారి వృత్తాంతానికి ఆనందదాయకమైన ముగింపును అనుగ్రహించటానికి యేసు ఎలా వచ్చారో వివరించు వృత్తాంతం కూడా అదే. భౌతిక మరణం ఒక ఆశీర్వాదమే తప్ప శాపం కాదు అనే ప్రాకల్పనతో సిద్ధ పడినవారమై ఈక్రింది కీర్తనలో మోషే సూచించిన ప్రకారం డెబ్బది సంవత్సరాలైన జీవించటానికి దేవుడు ఎందుకు అనుమతించుచున్నాడో మన మిప్పుడు ధ్యానించుదాం.

> *మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు అధికబలమున్న యెడల ఎనుబది సంవత్సరములగును అయినను వాటి వైభవము ఆయాసమే దు:ఖమే అది త్వరగా గతించును మేము ఎగిరిపోవుదుము.*
> *కీర్తనలు 90:10*

దేవుడు భౌతిక మరణాన్ని ఎందుకు అనుమతించుచున్నాడు? దీనికి సమాధానం వెదుకుతున్నవానిలా యోబు కూడా మనకు అగుపిస్తున్నాడు. అతడు చెప్పిన ఈ క్రింది మాటలను గమనించండి.

> *స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధనొందును. పువ్వు వికసించినట్లు వాడు పెరిగి వాడిపోవును. నీడ కనబడకపోవునట్లు వాడు నిలువక పారి పోవును. అట్టివాని మీద నీవు కనుదృష్టి యుంచియున్నావు తీర్పు నొందుటకై నన్ను నీ యెదుటకి రప్పించి యున్నావు.* యోబు 14:1-3

మానవులు ఫలించి, అభివృద్ధిచెంది భూమిని నిండించి తమ బిడ్డలను ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచటం దేవుని సంకల్పంలో ఒక భాగం (ఆది. 1:20; ఎఫెసీ. 6:4). తనకు కుమారులుగా ఉండటానికే దేవుడు మానవులందరినీ సృష్టిం చాడు. దేవుని కోసం దేవుని పిల్లల్ని మనం పెంచే విధానంలో ఎంతో జాగ్రత్త వహించాలి (యెహెజ్కేలు 16:20, 21). దేవుని రాజ్యం కోసం యేసు వంటి కుమారులు కావాలి. కాని, దేవుడు మానవుల్ని యేసు వలె ఉండినవారిగా సృష్టించటంలేదని మనకు తెలుసు. అయితే తాను కోరిన రీతిలో మనం అభివృద్ధి చెందగలుగునట్లు జీవించు ప్రాణిగా మానవుని సృజించి, తగిన ఏర్పాట్లు కావించాడు. మానవులకు మంచి చెడుల జ్ఞానమును సరిగా వినియోగించుకొను సామర్థ్యము లేనప్పటికి, దేవుడు కుమారత్వ ప్రణాళికను రద్దుచేయలేదు. ఆయనయందు, ఆయన ప్రణాళికనందు విశ్వాసం గల వ్యక్తులతో సహవసించుటకు ఆయన కృపను జతచేసినాడు.

మంచి చెడ్డలను తెలుసుకోగలిగే సామర్థ్యమును మనము పొందియున్నాము; అయినా సరే, జీవ నీయమము ప్రకారము మంచి చెడ్డలను తెలుసుకునేలా ఈ సామర్థ్యము మనల్ని తయారు చేయలేదు. ఈ ఎరిగియుండే విధానము నేర్చుకునే తత్వములో ఉన్నది. “వయస్సు వచ్చిన వారు అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును” హెబ్రీ. 5:14. ఈ నేర్చుకునే తత్వము అనేది మన దైనందిన జీవితములో శ్రమల ద్వారా క్రమశిక్షణను కలిగియుంటుంది (హెబ్రీ. 12:4-14). ఇది ఇంకా “ఆదాములో, క్రీస్తునందు” ఉండి దేవుని కుమారునిగా లేదా కుమార్తెగా వృద్ధి చెందాలని కోరు ఒక క్రైస్తవుని జీవితము. మనము “చెడ్డదాని నస హ్యించుకొని మంచి దానిని హత్తుకొని యుండాలి రోమా 12:9. మన దైనందిన లక్ష్యము: “కీడు వలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము” రోమా 12:21. కీడు విషయమై నిష్కపటులునై యుండవలెనని” పట్టుదల కలిగియున్నాము రోమా 16:19. ఈ భూలోకంలో వుండగా మనం ఏది సాధించాలని ప్రభువు కోరు కుంటున్నారో దానినంతటనీ చేయటానికి సరిగా మనకు డెబ్బది సంవత్సరాలు అవసరం అనేది స్పష్టమే. దేవుని కుమారులుగా పరిపక్వం చెందటానికీ, దేవుని కోసం పిల్లల్ని పెంచటానికీ, సువార్త ప్రకటన చేయునట్లుగా క్రీస్తు శరీరంలోని అవయవంగా పని చేయటానికి, ఆత్మీయంగా పెరుగునట్లుగా ఇతరులకు సహాయం చేయటానికి తగినంత సమయం మనకివ్వబడింది.

భౌతిక మరణాన్ని మనం అభినందించగోరిన పక్షంలో మనం జవాబు చెప్పవలసిన రెండో ప్రశ్న ఇదే: మనం చనిపోయినప్పుడు అసలు ఏమి సంభవిస్తుంది? అనగా మన శీలాన్ని, వ్యక్తిత్వాన్ని నాశనం చేయకుండానే దేవుడు మన శరీరాత్మలను వేరు చేయగలుగునట్లుగా మనల్ని సృష్టించటం నిజంగా మన భాగ్యమే. మానవుడు కష్టంలో పడతాడనే సంగతిని దేవుడు మానవుణ్ణి సృష్టించక

పూర్వమే ఎరుగును. యేసు పని మరియు మానవుల దత్తపుత్రత్వం అనువాటికి సంబంధించిన దేవుని భవిష్యత్ జ్ఞానము గూర్చి క్రొత్త నిబంధన గ్రంథకర్తలు కూడా చెప్పుచున్నారు (1 పేతురు 1:2,29; ఎఫెసీ. 1:4).

ఆదాము వలె మనం కూడా మరణించవలసివారమై ఉన్నామని దేవుడు ఎరిగియున్నందున రెండు ప్రత్యేక భాగాలుగా ఆయన మనల్ని సృష్టించాడు (1 కొరింథీ.15 :22; మత్తయి 10:28). 1 థెస్సలొనీకయ 5:23లో పౌలు ఆత్మ, ప్రాణం, మరియు శరీరం అనే మూడు భాగాలను ప్రస్తావించటం జరిగింది. అయితే, భౌతిక జీవితంలో మన శరీరాత్మలు ఏకంగా సంధించబడినపుడు మనం జీవించు ప్రాణుల మైతిమని మనం ఆలోచన చేస్తే ఈ మూడు భాగాలు నిజంగా రెండు భాగాలేనని మనం అర్థం చేసు కోగలం (ఆది. 2:7). ప్రాణము, శరీరము జీవాత్మ అవుతాయి. భౌతిక మరియుఆత్మీయ భావములో కూడ ఇది వాస్తవం. "మనము దిగంబరులము కాక" (2 కొరింథీ. 5:2)అని పౌలు చెప్పిన విధముగా ఉంటుంది. మరణంలో ఈ రెండుభాగాలు వేరై పోతాయి (ప్రసంగి 12:7). ఆత్మ సంబంధమైన శరీరాల్లో మన ఆత్మలు అవశ్యంగా నివసిస్తాయని తరువాత పాఠంలో నేర్చుకుందాం మహిమ శరీరాల్లో ఆత్మలు నివ సించటం జరుగు తుంది. కాబట్టి, మరోమారు ఈ రెండూ మనల్ని జీవించు ప్రాణులుగా రూపొందిస్తాయి. ఆత్మ, ప్రాణం మరియు శరీరం అనే ఈ మూడింటినీ 1 థెస్సలొనీకయ 5:23లో ప్రస్తావించినప్పుడు పౌలు ఆలోచించిన విధం ఇదే కావచ్చు.

ప్రత్యేకమైన రెండు భాగాలుగా మనల్ని మనం చూడవలసిన అవసరం ఉంది. అయినప్పటికీ, భూలోకంలో మనం జీవించవలసిన ఈ సమయంలో ఒకడు జీవించు ప్రాణిగా రూపొందటానికి శరీరం ఆత్మ అను ఈ రెండు ఒకదానిపై ఒకటి ఆధారపడి పని చేస్తాయి. ఈ రెండు కలసి మనం ఇప్పుడు కలిగి వుండిన ఉనికిని రూపొందిస్తాయి. మనం ప్రస్తుతం కలిగి వుండిన ఈ స్థితిలో ప్రాణం, ఆత్మ అనే ఈ రెంటి మధ్యవిభజన చేయగలగటం ఒక్క దేవుని వాక్యానికే సాధ్యమేమో! దయచేసి హెబ్రీ. 4:12 చదవండి. ఈ విభజన విషయంలో దేవుని వాక్యాన్ని మనం సరిగా అన్వయించుకోలేని స్థితిలో వుంటే అందుకు మనం చింతించవలసిన పని లేదు. ఎందుకంటే, ఈ క్రింది లేఖనాల ప్రకారం మరణం సరియైన విభజన చేస్తుంది.

*కావున మేము అధైర్యపడము మా బాహ్య పురుషుడు కృశించు చున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడు చున్నాడు.* *2 కొరింథీ. 4:16*

*భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమై పోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మన కున్నదని యెరుగుదుము.*

*2 కొరింథీ. 5:1*

మనం క్రైస్తవులమయ్యే ప్రక్రియలో మన మారుమనస్సులో మనల్ని మనం దేవునికి అప్పగించుకోవాలనీ, మన శరీర అవయవాలను దేవుని నీతికి దాసులుగా అప్పగించాలనీ ఓ మంచి నిర్ణయం చేసుకొన్నాము (రోమా. 6:13). సత్యసువార్త ద్వారా మన మనస్సులను నూతనపరచుకున్నందున ఇట్టి రూపాంతరం మనకు సాధ్య మైనది. మన మారుమనస్సు విషయంలో మనం యదార్థ వంతులము కావాలి. అప్పుడు, దినమంతా పనిచేసిన ఒడ్రంగి తన పరికరాలను ప్రక్కన పడేసి (laying down his tools) విశ్రాంతి కోసం ఇంటికి వెళ్లటం ఎంత సామాన్యమైనదిగా వుంటుందో మన భౌతికమరణం కూడా అంతే సామాన్యంగా వుంటుంది. భూసంబంధమైన మన గృహం అంటే శరీరం ఒక పరికరం. భూమిపై మనం జీవిస్తున్న దినాలలోదేవునిని సేవించటానికే ఆయన దానిని మనకు అనుగ్రహించాడు. శరీరంలో నుండి ఆత్మ తప్పక విడిచివెళ్లవలసివచ్చేటంతగా మన బాహ్యపురుషుడు కృశించి పోయినప్పుడుతాను కోరిన "తనగృహమును" వృద్ధిచేసేపనిని దేవుడు ముగించటం జరుగు తుంది. మరణానికి సంబంధించిన క్రైస్తవ దృక్పథాన్ని అపొస్తలుడైన పౌలు ఈ క్రింది లేఖనంలో ప్రస్తావించాడు. అతని దృక్పథాన్ని మరో మారు ఆలోచించుదాం.

*ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించు కొనినప్పుడు,- విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును.*

*1 కొరింథీ. 15:54*

"ఓ అవివేకీ! నీవు విత్తునది చచ్చితేనేగానీ అది బ్రతికింపబడదుగదా!" అని పౌలు చెప్పటం జరిగింది (1కొరింథీ. 15:36). మనం భౌతికంగా మరణించినప్పుడు ఏం జరుగుతుంది? ఇక ఏమాత్రం పనిచేయలేని శరీరం నుండి అసలువ్యక్తి వేరైపోవు నట్లుగా సామాన్యవిభజన జరుగుతుంది. మృతుల పునరుత్థానంలో క్షయం కాని శరీరాలు మనకు అనుగ్రహింపబడతాయి. "మనసొంతమైన దానిని" దేవుడు మనకు ఇవ్వగల గటానికి భౌతిక మరణమే ఏకైక మార్గమై ఉండగా దానిని ఒక శాపంగా మనమెందుకు చూడాలి? (లూకా 16:12).

ఈ పాఠంలో మనం చర్చించబోయే చివరిప్రశ్న మిగిలిన ప్రశ్నలతో పాటు సమానమైన ప్రాముఖ్యం వహిస్తుంది. ఈ ప్రశ్నలన్నీ భౌతికమరణం విషయంలో క్రైస్తవులమైన మన దృక్పథానికి సంబంధించినవేనని మనం మరువరాదు మనం చని పోయినవెంటనే ఎక్కడికి పోతాము? బాల్య దశలోవుండినప్పుడు థెస్సలోనికయలోని క్రీస్తుసంఘం చనిపోయిన తమ సభ్యుల విషయంలో ఆలోచన కలిగివున్నారని స్పష్టంగా అర్థమౌతుంది. క్రీస్తు నందు నిద్రించిన తమ సోదరులను గూర్చి దుఃఖపడరాదని వారికి చెప్పబడింది. ఎందుకంటే, యేసు తిరిగి వచ్చేంతవరకు మాత్రమే చనిపోయిన వారు అట్టిస్థితిలో వుంటారు. "క్రీస్తు వచ్చిన మీదట క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు." దయచేసి, 1 థెస్స 4:13-18 చదవండి.

యెహాను ప్రత్యక్షతలో యేసు ఐదవ ముద్రను విప్పినప్పుడు, "దేవుని వాక్యం నిమిత్తం వధింపబడినవారి ఆత్మలు" కేకలు వేయటాన్నిబట్టి వారిమధ్య కొన్ని కార్య కలాపాలు జరుగుతున్నట్లుగా మనం చూస్తాము. "వారివలెనే చంపబడబోవు సహ దాసులయొక్కయు, తమ సహోదరుల యొక్కయు లెక్క పూర్తియగువరకు కొంచెము కాలం వారు విశ్రమించవలెనని" వారికి చెప్పబడింది (ప్రకటన 6:9-11) చనిపోయిన ఈ పరిశుద్ధుల పరిస్థితి అసాధారణం కావచ్చు. అయితే, ప్రకటన గ్రంథంలోని ఈక్రింది వచనం చనిపోయిన క్రైస్తవుల యొక్క సాధారణ పరిస్థితిని వివరించుచున్నది.

> *అంతట- ఇప్పటి నుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులని వ్రాయుమని పరలోకము నుండి యొక స్వరము చెప్పగా వింటిని. నిజమే వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు వారి క్రియలు వారి వెంట పోవునని ఆత్మ చెప్పుచున్నాడు. ప్రకటన. 14:13*

రక్షింపబడినవారికిగానీ, రక్షింపబడనివారికిగాని మరణం తరువాత సంభవింప బోవు దానిని తెలిసికోవాలంటే పాతాళలోకం అంతటికీ సంబంధించిన సంపూర్ణ దృక్పథం మనకు అవసరం. ధనవంతుడు -లాజరు కథను యేసు మనకు చెప్పి పాతాళ లోకానికి సంబంధించి మంచి వివరణను అనుగ్రహించారు. దయచేసి,లూకా 16:19-31 చదవండి. క్రైస్తవ మత సాహిత్యంలో ఈ కథ కొన్ని మారులు ఉపమానముగా వర్గీకరింపబడింది. అయితే, నిశ్చయంగా, ఈ కథ ఒక ఉపమానం కాదు. మరణం తరువాత ఇద్దరు వ్యక్తులకు నిజంగా సంభవించినదానికి సంబంధించిన ఒక వాస్తవ వివరణే ఈ కథ. యుగాంత సంగతులను వివరించే ఈ కథలో అబ్రాహాము రొమ్ము లాజరు యొక్క విశ్రాంతి స్థలమని మనకు అర్థమౌతుంది. ఇది పాతాళంకావచ్చు సిలువపై యేసు మరణించిన తరువాత మూడు దినాలలో కొంత భాగం ఆయన పాతాళములో గడిపారు. కాబట్టి, పాతాళ లోకంలో ఒక మంచిస్థలం వుందని మనకు తెలుస్తుంది (అపొ. కార్య. 2:27). బహుశా లాజరు యేసు ఉన్న ప్రదేశంలో మంచి స్థలమందు ఉండియుంటాడు.

దేవునికి విశ్వాసులైన లాజరు మరియు ఇతరులైన మరికొందరు అబ్రాహాము రొమ్మున ఎందుకు నివసిస్తారో మనం అర్థం చేసుకోగలం. మెట్టుకు, "విశ్వాసులందరికీ అతడు తండ్రి అగును" అని అబ్రాహాముతో దేవుడు వాగ్దానం చేయటం జరిగింది (రోమా. 4:11) బాప్తిస్మమందు క్రీస్తును ధరించుకొని క్రైస్తవులమైన మనం అబ్రాహాము యొక్క సంతానం అవుతాము (గలతీ. 3:27-29). "ఆర్భాటము తోను, ప్రధానదూత శబ్దంతోను. దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చు" పర్యంతం చనిపోయిన విశ్వాసులు అబ్రాహాము రొమ్మున ఆనుకొని ఆదరణ అనుభవిస్తారు. (1 థెస్స. 4:16). "కాబట్టి, దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. ఎందుకనగా దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము, ఆయన యొక్క విశ్రాంతిలో ప్రవేశించినవాడు కూడ తన కార్యములను ముగించి విశ్రమించును"అని హెబ్రీ గ్రంథకర్త ప్రకటించాడు (హెబ్రీ. 4:9,10).

పాతాళంలో మరో స్థలం వుంది. లాజరు విశ్రాంతి పొందుతున్న స్థలం నుండి అది ఒక మహా అగాధం చేత ప్రత్యేకింపబడింది. ఆ స్థలంలోనే రక్షణ పొందని ధన వంతుడు మేల్కని ఉన్నాడు. అక్కడికి వెళ్లిన వెంటనే అతడు అగ్నిజ్వాలలో యాతనపడు చున్నాడు మరియు అతని తప్పిదాలు అతనికి ఇంకా జ్ఞాపకం ఉన్నాయి. మరణించిన తరువాత ఎక్కడికి వెళ్లాలో నిర్ణయం తీసుకోగలిగే స్థితిలోనే ఇంకా ఉండిన తన ఐదుగురు సహోదరులు అతనికి జ్ఞాపకం వచ్చారు. అతడు అక్కడ వుండిన సమయంలో సజీవుల మధ్య భూలోకంలో జరుగుచున్న సంగతులు అతనికి తెలుస్తాయని మనకు తెలుపబడలేదు. కానీ, అతడు మరణించి నప్పటికి అతడు ఎరిగి వుండిన సంగతులను జ్ఞాపకంచేసుకుంటున్నాడు. తాను ఉండిన స్థలం మరియు తనకుండిన జ్ఞాపకాలు అనువాటికి మించిన సంగతులను గూర్చిన అవగాహన అతనికి ఉంది. లాజరును అతడు ఎక్కడ చూడగలడో అతనికి తెలుసు.

తాము చనిపోయే సమయం వరకూ దేవునితో సరియైన సహవాసాన్ని కలిగి వుండిన వారు చనిపోయిన వెంటనే విశ్రాంతి పొందగల స్థలానికి వెళతారని పైన చెప్పుకొనిన కథను బట్టి మరికొన్ని ఇతర లేఖనములను బట్టి మనం నిర్ధారించగలం. సంగతులను ఎరుగగల స్థితిలో వారు ఉండవచ్చును లేదా ఉండకపోవచ్చును. అంటే, వారు నిద్రిస్తూ ఉండవచ్చును. యేసు చెప్పిన ఈ కథలో లాజరు ఏమీ మాటలాడలేదు ఏదీ చేయలేదు. అయితే రక్షణ పొందని వారి విషయంలో మాత్రం కథ మరోలా వుంది. వారు యాతన అనుభవిస్తున్న సంగతి వారికి తెలిసింది, భూమిపై వారు విడిచి వచ్చిన సంగతులు వారికి జ్ఞాపకం ఉన్నాయి. ఈ జ్ఞాపకమే చాలామందికివారి యాతనకు ఆధారం అవుతుంది.

భౌతిక మరణం మరియు పాతాళ లోకం అనువాటిని గూర్చి అడగబడిన ఈ మూడు ప్రశ్నలకు బైబిలు నుండి సమాధానాలు చెప్పిన తరువాత విశ్వాసులైన క్రైస్తవులు భౌతిక మరణాన్ని ఒక శాపముగా ఎంచరని మనం చూడగలం. శాపమునకు బదులు అవశ్యంగా అది ఒక ఆశీర్వాదం ఔతుంది. మానవుడు మంచిచెడ్డల తెలివి పొందిన తరువాత వాని జీవితానికి కాల పరిమితిని దేవుడు నియమించవలసివచ్చినదని మన మెరుగుదుము. భౌతిక మరణంలో మన ఆంతర్య పురుషుడు అనగా మన అసలువ్యక్తి పోగొట్టుకొనేది ఏదియు ఉండదని మనం ఎరుగుదుము. భౌతిక మరణం కేవలం ఈ లోకంలో మనం మన పనిని ముగించుకొని పరికరాన్ని ప్రక్కన పడేయటం లాంటిదే. విశ్వాసులుగా మరణించిన మనం మృతుల పునరుత్థానంలో పాలుపొందక పూర్వం విశ్రాంతిని పొందవచ్చును. అయితే, యేసు రెండవమారు రావటం అవశ్యంగా మనం మరణించిన తరువాత సంభవిస్తేనే అది జరుగుతుంది.

ఈ క్రింది చెప్పబడిన ఆలోచన చాలా ఉన్నతమైనదని మనం తలంచవచ్చును.

*మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను ఆ తరువాత తీర్పు జరుగును.*

*హెబ్రీ. 9:27*

## చర్చ కోసం ప్రశ్నలు

1. అపొస్తలుడైన పౌలు తన భౌతిక మరణం పట్ల కలిగివుండిన దృక్పథం ఏది?
2. భౌతిక మరణాన్ని యాకోబు ఏమని వర్ణించాడు?
3. చనిపోయినతరువాత మన శరీరాలు ఎట్లు నేలమంటికి తిరిగి చేరుకుంటాయో అర్థం చేసుకోవటం ఎప్పుడు కష్టతరం కాదు?
4. బలహీనమైన విశ్వాసము గలవారుకానీ, విశ్వాసమే లేనివారు కానీ తమ భౌతిక మరణాన్ని సాధారణంగా ఎట్లు వ్యాఖ్యానిస్తారు?
5. ముగింపును సూచించునట్టియు, భౌతిక మరణాన్ని వివరించునట్టివియునైన నాలుగు బైబిలు పదజాలములను వరుసగా వ్రాయండి?
6. దేవుడు మనల్ని ఎందుకు చనిపోనిస్తున్నాడు?
7. ఆదాము పాపం చేసిన తరువాత తక్కిన మానవులను దేవుడు మరో విధానంలో రూపొందించెనా?
8. ఆదాము హవ్వలు మంచిచెడ్డల తెలివిని పొందిన పిమ్మట భౌతిక మరణం ఆశీర్వాదమా? శాపమా? నీవేమని నమ్ముచున్నావు?
9. ఆదాము పాపము చేసిన తరువాత మానవ జాతికి సంభవించిన భ్రష్టత్వాన్ని బాగుగా క్లుప్తీకరించు ఒక లేఖనం తెలుపండి.
10. మానవజాతి మీదకి దేవుడు పంపిన శాపాలు ఏవి?
11. రమారమిగా డెబ్బది సంవత్సరాలు బ్రతకటానికి దేవుడు మానవులకు ఎందుకు అవకాశమిచ్చుచున్నాడు?
12. భౌతిక మరణం అనే ప్రక్రియలో అసలు ఏమి సంభవిస్తుంది?
13. మన యొక్క శరీరాత్మల మధ్య జరిగే అన్యోన్య క్రియల వల్ల యేర్పడినది ఏమిటి?
14. క్రైస్తవులైనప్పుడు పొందిన తమ మారుమనస్సు విషయంలో నమ్మకంగా జీవించిన వారికి భౌతిక మరణం ఒక విజయం ఎలా అవుతుందో వివరించండి.
15. మరణించిన వెంటనే మనుష్యులు ఎక్కడికి పోతారు?
16. పాతాళ లోకాన్ని వర్ణించండి.
17. రక్షణ పొందినవారుగానీ రక్షణ పొందనివారుగానీ భౌతిక మరణం తరువాత కలిగివుండే చేతనా జ్ఞానాన్ని వర్ణించండి.
18. అబ్రాహాము రొమ్మున క్రైస్తవులు ఎందుకు ఆదరణను అనుభవిస్తారు?
19. మన సొంత మరణం విషయంలో మన యొక్క వైఖరిని నిర్ణయించేది ఏది?
20. భౌతిక మరణాన్ని ఆపగలిగేది ఏది?